పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ



జుజ్జూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ప్రజాప్రతినిధులు



శనగపాడులో మెడికల్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు

జుజ్జూరు(వీరులపాడు): నిరుపేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో పట్టణాల్లో ఉండే వారికి మాత్రమే మెరుగైన వైద్య సేవలందేవని కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం ఇంటి వద్దనే నాణమైన ఉచిత వైద్యం అందుతుందని తెలిపారు. గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పలు రకాల పరీక్షలు చేయటమే కాకుండా గ్రామంలో ఏర్పాటు చేసే ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించి మందులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, సర్పంచ్ రమావత్ కోటి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, నాయకులు ఆకుల అంజయ్య, రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్యాలలో..

మండలంలోని పెండ్యాల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం

భీమవరం(వత్సవాయి): గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పేదలకు వరమని సర్పంచ్ భీమాల సుజాత పేర్కొన్నారు. బుధవారం సచివాలయం-2 పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఆరోగ్యంగా ఉండాలని వారి ఇళ్ల వద్దకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. అన్ని రకాల పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

శనగపాడు(పెనుగంచిప్రోలు): ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వారి కుటుంబంలోని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి కావల్సిన పరీక్షలు నిర్వహించి మందులను అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రతి గడపలో ఉన్న వారి అనారోగ్య సమాచారాన్ని సేకరించి వారి అవసరమైన సలహాలను అందించి వారికి కావలసిన వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలను జరిగిన దాఖలాలు లేవని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వూట్ల నాగమణి, సర్పంచ్ సైదులు, ఎంపీటీసీ కీసర లోకేశ్వరరావు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వ్యాధులకు ఉచిత వైద్యం..

నందిగామటౌన్: గతంలో పేదవానికి వ్యాధి అంటే మరణంతో సమానమని, కానీ నేడు ఏ వ్యాధికైనా కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యమందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ప్రధాతగా ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని ఏర్పరచుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో చందర్లపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను బుధవారం ఆయన ప్రారంభించారు.



చందర్లపాడులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైద్యంతో పాటు ఉచితంగా మందులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి మరింత భద్రత కల్పించేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. గతంలో ఎవరైనా వైద్యం చేయించుకోవాలంటే ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉండేదని కానీ నేడు ఆ పరిస్థితికి స్వస్తి పలికి ఇంటి వద్దనే వైద్యమందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపటంతో పాటు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఏడు రకాల పరీక్షలు చేయటంతో పాటు శిబిరాల్లో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. ముందుగా ఆరోగ్య శిబిరంలోని మందులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్‌లు సూరా వెంకటనర్సమ్మ, కస్తాల పున్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- కోనాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కోనాయపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు రూపొందించటమే కాకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మంచిని ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకెళ్లటంతో పాటు ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికలకు ముందు హామీలివ్వటం అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించటం ప్రజలను మోసం చేయటం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియదన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండి రానున్న ఎన్నికల్లో సైతం ఘన విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుగ్గినేని సురేష్, కమతం వెంకట నర్సిరెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, పలువురు నాయకులు,సచివాలయసిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నుంచి పట్టణంలో ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 7వ సచివాలయ పరిధికి సంబంధించి గురువారం తొర్రగుంటపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సంబంధించిన వలంటీర్, హెల్త్ సెక్రటరీ, ఆశా వర్కర్, గృహ సారథుల ద్వారా వారి ఆరోగ్య సమస్యలను నమోదు చేయించుకున్న వారు, లేదా చేయించుకోవాల్సిన వారు జగన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరుకావాలని కోరారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. పట్టణ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు విచ్చేస్తారని తెలిపారు.

నందిగామ పరిధిలో..

నందిగామ: మున్సిపాలిటీ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఒకటి నుంచి 10వ సచివాలయాలకు సంబంధించి అనాసాగరం గ్రామంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని మెరుగైన వైద్య సేవలు అందిస్తారని కమిషనర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొంటారన్నారు.

అనుమంచిపల్లిలో..

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు బుధవారం పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. ఆరోగ్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఎం నుంచి లేఖ అందుకున్న విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలుకు చెందిన విద్యార్థిని షేక్ మహబూబీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నుంచి లేఖ అందుకుంది. గతేడాది జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్షా పే పేరులో తమ అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వంతో ఆన్‌లైన్‌లో పంచుకున్నారు. అందులో భాగంగా ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ మహబూబీకి ప్రత్యేక ప్రోత్రాహం అందించారు. పరీక్షా పే చర్చలో పాల్గొనే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి విద్యార్థినికి అభినందన లేఖ పంపించారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల సమక్షంలో లేఖను అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు రమణ, రాఘవచారి, దానయ్య, సుబ్బారావు, ప్రభుదాస్, జిలానీ, వెంకటేశ్వరరావు, బాబుప్రసాద్, రామునాయక్, కాంత, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



ఎమ్మెల్సీ రుహుల్లాను సన్మానిస్తున్న దర్గా కమిటీ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే మసీదులు, దర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. గన్నవరం నియోజకవర్గం పరిధిలోని ముస్తాబాద్ గ్రామంలో 350 ఏళ్ల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ముస్తఫా వలి బాబా దర్గాలో అనేక సమస్యలు నెలకొన్నాయని, ప్రధానంగా దర్గాకు రోడ్డు మార్గం లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్సీ రుహుల్లా సానుకూలంగా స్పందించి, దర్గా అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి తప్పకుండా సహాయం అందిస్తామని, గన్నవరం ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడి రోడ్డు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాను ఇస్లాం సంప్రదాయం ప్రకారం సన్మానించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ప్రత్యేక దువా చేశారు. దర్గా ముజావర్లు షేక్ మహిబుల్లాఖాన్, హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పేటలోని బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో జేసీబీతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గురుకుల పాఠశాల ఆవరణలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉంది. పాములు, క్రిమి కీటకాలు తరచూ రావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జేసీబీని పంపించి 4 గంటల పాటు కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆవరణంతా శుభ్రం చేయించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ సుజాత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై 'చేరువ'తో అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియా, సైబర్ నేరాలపై పోలీసు శాఖకు చెందిన చేరువ వాహనం ద్వారా పోలీసులు అవగాహన కల్పించారు. చేరువ వాహనంలోని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఏ విధంగా నేరాలు జరుగుతాయో వాటి నుంచి ఏ విధంగా జాగ్రత్తగా ఉండాల్లో పోలీసు శాఖ చిన్నచిన్న నాటికల ద్వారా వివరించారు. పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై సూచలందించారు. వాటితో పాటుగా చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలను సైతం ఈ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. యువతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా వివరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రథం సెంటర్, కనకదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో పాదచారులు, భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గున్నారు.

అమెరికా ఎకానమీపై విద్యార్థులకు అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అమెరికన్ సొసైటీ, కల్చర్ అండ్ ఎకానమీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూఎస్ఏకు చెందిన డాక్టర్ సురేఖ నేరెళ్ల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇండియన్ సొసైటీ కల్చర్ అండ్ ఎకానమీ, అమెరికన్ ఎకానమీకి ఉన్న సంబంధాన్ని తెలియజేశారు. అలాగే అమెరికాలో విద్యావిధానం, ఆరోగ్యం, సివిల్ రైట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎన్‌జే సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎస్‌టీవీఆర్ విద్యార్థి



కార్తీక్‌ను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 8వ సబ్ జూనియర్స్ స్టేట్ చాంపియన్ షిప్‌లో దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగర పాలకసంస్థ పాఠశాల విద్యార్థి పట్నాన కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో కార్తీక్‌ను పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎంజీపీ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్‌వీ శ్యామ్ ప్రసాద్, ఆంగ్ల ఉపాధ్యాయురాలు కె. రాణి కలిసి కార్తీక్‌కు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఎన్టీఆర్ జిల్లా జట్టుకు..

దుర్గాపురం ఎస్‌టీవీఆర్ పాఠశాల విద్యార్థులు బి. హేమేంద్ర, పి. తనోజ్‌కుమార్, బి. రామ్‌చరణ్ ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. అలాగే బాలికల విభాగంలో జి.రమ్య, పి.లలిత షేక్ కరిమున్నీసా, ఆర్.మానస ఎంపికయ్యారు. ఈ జట్లు ఈనెల 18వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుపతిలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంటాయి.

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



వెంకటాపురం(పెనుగంచిప్రోలు): పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. గ్రామంలో సంకల్ప సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన, కిచెన్ గార్డెన్, గర్భిణులకు సీమంతం, చిన్నారులకు ఎత్తు, బరువు చూడటం, అన్నప్రసన కార్యక్రమాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఓట్ల నాగమణి, చిల్లకల్లు ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీ భార్గవి, ఏవో సిద్దారెడ్డి, సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల్లో సర్పంచ్‌లు, వేల్పుల పద్మకుమారి, జ్యోతి బ్రహ్మం ఆధ్వర్యంలో సంకల్ప సప్తాహ ర్యాలీ నిర్వహించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఫాగింగ్, నీళ్లు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ పిచికారీ వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, వార్డు నాయకుడు బెజవాడ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాన్ని ఆవిష్కరించేవి కార్టూన్స్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని దగ్గరగా ఆవిష్కరించే శక్తి కార్టూన్స్‌కు ఉంటుందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కోసా, ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్టూన్స్ వేయటంపై శిక్షణ శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపిశెట్టి మల్లయ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా స్వల్ప మాటలతో, చిట్టిచిట్టి బొమ్మలతో అద్భుతమైన సందేశాన్నిందించటమే కాకుండా ఆలోచింపజేసేలా చేయొచ్చన్నారు. మానవ జీవితంలోని చాలా అంశాలను కార్టూనిస్టులు అద్భుతంగా వేసి సమాజాన్ని జాగృతం చేస్తున్నారని వివరించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు



తిరువూరు: విద్యార్థులు సరదా కోసం తోటివారిని ర్యాగింగ్ చేసినా శిక్షార్హులవుతారని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో మెలగాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలో ఎటువంటి తప్పటడుగు వేసినా భవిష్యత్ అంధకారమయం అవుతుందన్నారు. ఉపాధి అవకాశాలు కోల్పోతారని జడ్జి తెలియజేశారు. బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏపీపీ బడేమియా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నందిగామ: పట్టణంలోని కృష్ణ బలిజనగర్‌లో బుధవారం కృష్ణ బలిజ సంఘం కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ముందుగా సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా చేజర్ల సత్యనారాయణ, కార్యదర్శి శివనాగరాజు, కోశాధికారి వీసం రాఘవబాబు, ఉపాధ్యక్షుడు బాల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా అజయ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని పలువురు సత్కరించారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం ఆధ్వర్యంలో బుధవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం పాడిరైతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రైతులు కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వాటిలో మంచి పోషణ చేసిన లేగదూడలకు పశుగణాభివృద్ధి సంస్థ ఈవో కె.శ్రీనివాసులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నందిగామ ఏడీఏ వెంకట్రావు, పశు వైద్యాధికారి అర్చన, రైతులు పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన స్మృతివనం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన విగ్రహ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ కూడా వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాంగణంలో లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్మృతివనంలో మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ సీలింగ్, ఎలక్ట్రిసిటీ పనులను పెయింటింగ్ పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



తిరువూరు: తమ సమస్యల పరిష్కారానికి తిరువూరు డివిజన్లో తపాలా శాఖ ఉద్యోగులు బుధవారం సమ్మె నిర్వహించారు. ఎనిమిది గంటల పనివిధానం, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలు అమలు చేయడం, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంపు, గ్రాట్యుటీ రూ.5 లక్షలు చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకు ఈ సమ్మె చేసినట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు తెలిపారు. డివిజన్లోని జీడీఎస్ సిబ్బంది తిరువూరు సబ్ పోస్టాఫీసు ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు బీ లక్ష్మణరావు, ఎస్.కుమారి నాయకత్వం వహించారు.